

గొడ్డేరు నుంచి గుట్టుగా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సాక్షాత్తు ముక్కంటి పాదాల చెంత ప్రవహిస్తున్న స్వర్ణముఖి నదిలో రాత్రికి ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. స్వర్ణముఖి నదిలోని గొడ్డేరు ప్రాంతంలో రాత్రిళ్లు జేసీబీల సాయంతో తవ్వకాలు చేసి ఆ ఇసుకను పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో డంప్ చేస్తున్నట్లు సమాచారం. అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి. శ్రీకాళహస్తీశ్వరాలయానికి కూత వేటు దూరంలోనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోని పరిస్థితి. ఇసుక అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలన్న లక్ష్యంతో ఎక్కడికక్కడ ట్రెంచ్ లు కొట్టి అడ్డుకుంటున్నా అక్రమార్కులు ఏదో ఒక మార్గంలో గుట్టు చప్పుడు కాకుండా తమ పనిని కానిచ్చేస్తున్నారు. అధికారులు నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

'బిఆర్ నాయుడు' మన జిల్లా వాసే..!

దీపావళి కానుకగా టిటిడి బోర్డు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలకమండలి అధ్యక్షులుగా టివి 5 ఛైర్మన్ బి.రాజేంద్ర నాయుడు(బిఆర్ నాయుడు) నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహామహులు పోటీపడినా తొలినుంచి ఊహించినట్లే బిఆర్ నాయుడునే ఆ పదవి వరించింది. ఓ రకంగా దీపావళి పండుగ 'బిఆర్ నాయుడు' కుటుంబంలో వెలుగులు నింపింది. ఎన్నికలకు ముందు టివి 5లో కూటమి పార్టీలకు అనుకూలంగా కథనాలను, వార్తలను ప్రచురించింది. దీంతో అప్పట్లో జగన్ ప్రభుత్వంలో ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొంది. రెండేళ్లపాటు ఈ పదవిలో బిఆర్ నాయుడు కొనసాగుతారు. అయితే టిటిడి ఈవో, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, తుడ ఛైర్మన్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారు.

వ్యవసాయ కుటుంబంలో పుట్టి

వ్యవసాయ కుటుంబంలో పుట్టి అంచలంచలుగా ఎదిగి నేడు టిటిడి ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరిస్తున్న బొల్లినేని రాజగోపాల్ నాయుడు అలియాస్ బిఆర్ నాయుడు చిత్తూరు జిల్లా మారుమూల గ్రామం పెనుమూరు మండలం దిగువ పూనేపల్లిలో జన్మించారు. చిత్తూరు ఐటిఐలో ఫిట్టర్ చేసి అనంతరం హైదరాబాదులోని బిహెచ్ఇఎల్ లో ఉద్యోగిగా చేరారు. 1973లో విజయలక్ష్మిని వివాహమాడారు. కైకలూరుకు చెందిన విజయలక్ష్మి బీహెచ్ఈఎల్లో టైపిస్టుగా పనిచేస్తున్న ఆమెను ప్రేమ వివాహం చేసుకున్నారు. బిఆర్ నాయుడు కుటుంబ నేపథ్యం వారి అన్నదమ్ములు కూడా అందరూ ఉద్యోగస్తులే. కుటుంబం మొత్తం కష్టపడే మనస్తత్వం. దిగువ పూనే పల్లి గ్రామంలో మునస్వామి నాయుడు లక్ష్మమ్మలకు ఆరుగురు సంతానం. ఎన్టీఆర్ హయాం నుంచి టిడిపిలో కీలక పాత్ర పోషించారు. చంద్రబాబుతో ఉన్న అనుబంధం నేటికీ కొనసాగుతోంది. 2007లో అక్టోబర్ రెండో తేదీన టీవీ 5 ఛానల్ ను ప్రారంభించారు. ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో 2007లో బి.ఆర్ నాయుడు మనవరాలి పేరుతో శ్రేయ బ్రాడ్కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ టీవీ5 ఛానల్ ను ప్రారంభించి అందరి మన్ననలను పొంది ప్రజాదరణతో ఛానల్ ను మరింత ముందుకు తీసుకెళ్లారు.

విద్యార్థుల్లో సృజన్మాతకతను పెంపొందించాలి

ప్రజాశక్తి -తిరుపతి సిటి

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడం అవసరమని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కుమార్ తెలిపారు. స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వర్కషాప్ బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపి విభాగంలోవిశిష్ట అనుభవం వున్న డాక్టర్ ప్రియాన్ను స్విమ్స్ కు రావడం, వారి అనుభవాలు విద్యార్థులతో పంచుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ కె. మాధవి, కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫి వైద్యులు విశ్వనాధ్ రెడ్డి పాల్గొన్నారు.

శివుని సేవలో తెలంగాణ సీఎం సతీమణి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీతారెడ్డి బుధవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ ఈవో చంద్రశేఖర ఆజాద్ సాంప్రదాయ స్వాగతం పలికి రాహు-కేతు పూజలు చేయించారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం మత్యుంజయ స్వామి సన్నిధానం వద్ద శేష వస్త్రంతో సత్కరించి, జ్ఞాన ప్రసూనాంబికా సమేత తీర్థప్రసాదాలు చిత్రపటాన్ని అందజేశారు. ఏఈఓ సతీష్ మాలిక్, టెంపుల్ ఇన్స్ స్పెక్టర్ హరి యాదవ్, పిఆర్ఓ రవి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమైన నారుతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్ వరి సాగులో ఆరోగ్యమైన నారు నాటడం వలన అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య తెలిపారు. రబి వరి సాగుపై మండలంలోని వేడం గ్రామంలో ఆయన రైతులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాలరావు రబి కాలానికి బిపిటి-3082, ఎన్ ఎల్ ఆర్-34449, ఎం టి యు -1271, కే ఎన్ ఎం-733 అనువైనవిగా తెలిపారు. ఆర్ఎన్ఆర్-15048 రకాన్ని నవంబర్ 15 పైన నారు పోసి డిసెంబర్ 15 లోన నాటుకోవాలని కోరారు. శ్రీకాళహస్తి ఏ డి ఏ రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మతి చెందిన తొట్టంబేడు మండలం బసవయ్యపాలెం యానాది కాలనీకి చెందిన ఫారెస్ట్ వాచర్ వెంకటేష్ కుటుంబానికి పోలీస్, ఫారెస్ట్ శాఖాధికారులు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. వెంకటేష్ మతికి కారణమైన గ్యాస్ లారీ ఓనర్ చేత రూ. 50 వేలు మొత్తాన్ని డిడి రూపంలో ఆయన భార్య పద్మకు శ్రీకాళహస్తి డిఎస్పి కార్యాలయంలో అందించారు. వెంకటేష్కు ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయం త్వరలోనే అందజేస్తామని డిఎస్పీ నరసింహమూర్తి, డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ రామకష్ణ హామీ ఇచ్చారు. సిఐలు గోపి, వెంకటేశులు పాల్గొన్నారు.

సామాజిక భద్రత పింఛన్లకు రూ.112.37 కోట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నవంబర్ నెల ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు సచివాలయ సిబ్బంది ద్వారా లబ్దిదారుల ఇళ్ల వద్దనే పెన్షన్ల పంపిణీ జిల్లాలో 2,65,488 మందికి సుమారు రూ.112.37 కోట్లు పంపిణీ నవంబర్ 1వ తేదీన చేయనున్నట్లు కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. పెన్షన్ లబ్దిదారులు ఎవ్వరూ సచివాలయ కార్యాలయానికి పెన్షన్ కొరకు రావలసిన అవసరం లేదని తెలిపారు.

వరద బాధితులకు విద్యార్థుల చేయూత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

విజయవాడ వరదల్లో సర్వం కోల్పోయిన బాధితులకు తొట్టంబేడు మండలం గుండేలిగుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా ఆర్థిక సాయమందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సేకరించిన 12 వేలా 830 రూపాయల మొత్తాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ డీడీ రూపంలో ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డికి అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునితిరుమలయ్య, చెంచయ్య, భాస్కర్, మునీశ్వర్ రెడ్డి, జయ సింహ, శ్రీకర్, ఢిల్లీ బాబు, మస్తాన్ రావు, రమాదేవి పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీతో టాస్క్‌ఫోర్స్ నివాళి

ప్రజాశక్తి - తిరుపతి మంగళం అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి అమరవీరులకు బుధవారం ఘనంగా నివాళి అర్పించారు. టాస్క్ ఫోర్స్ ఇంచార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాలు మేరకు ర్యాలీని టాస్క్ ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ ప్రారంభించారు. అమర వీరులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో ఏసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ పాల్గొన్నారు.

టెన్నిస్‌లో తాటిపర్తి మనువరాళ్ల ప్రతిభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్

కాకినాడ డీఎస్ఏ క్రీడా మైదానంలో జరిగిన అండర్-14, 17, 19 బాలుర, బాలికల అంతర్ జిల్లాల టెన్నిస్ పోటీల్లో మండల టీడీపీ సీనియర్ నేత తాటిపర్తి ఈశ్వర్ రెడ్డి మనవరాళ్లు ప్రతిభ చాటారు. హిమజా రెడ్డి అండర్-19 కేటగిరీలో బంగారు పతకం, అండర్-17 విభాగంలో తన్విశ్రీ కాంస్య పతకం సాధించి జాతీయ టెన్నిస్ స్కూల్ గేమ్స్ కు అర్హత సాధించారు. ఈ సందర్భంగా హిమజా, తన్విశ్రీలను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అభినందించారు.

రేపు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1న రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని శ్రీకాకుళం నుండి ప్రారంభించనున్నారు. జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో ఉచిత గ్యాస్ పంపిణీ పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి అందరూ డి ఆర్ ఓ, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి రాజు, ఆర్డీఓ లు, మునిసిపల్ కమిషనర్లు తాసిల్దార్లు ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. "ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం" అమలు కార్యక్రమం పై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాలలో ఎంపీ, ఎమ్మెల్యే తదితర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అలాగే జిల్లా స్థాయి కార్యక్రమం చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం దామల చెరువు నందు నిర్వహించనున్నట్లు ఏర్పాట్లు పక్కాగా ఏర్పాటు ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బిపిఎల్ తెల్ల రేషన్ కార్డు కలిగి ఆధార్ అనుసంధానం చేసుకున్న వినియోగదారులకు ప్రతి ఆర్థిక సంవత్సరానికి మూడు ఉచిత ఎల్ పి జి గ్యాస్ సిలిండర్ ల పంపిణీకి శ్రీకారం చుట్టనుందని అన్నారు. మన జిల్లాలో 6,00,307 కార్డులు ఉన్నాయని, మొదట గ్యాస్ ఏజెన్సీ వద్ద డబ్బులు చెల్లించవలెనని, తదుపరి గ్యాస్ సబ్సిడీ నగదు 48 గం.లలో వినియోగదారుని బ్యాంక్ ఖాతాలకు చెల్లింపు జరుగుతుందని తెలిపారు.

అర్హులకు కేంద్ర పథకాలు అందాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ అర్హులైన పేదలకు కేంద్ర పథకాలను తప్పనిసరిగా అందించాలని, లేనిచో చర్యలు ఉంటాయని దిశ ఛైర్‌పర్సన్, తిరుపతి ఎంపి గురుమూర్తి అన్నారు. అధికారులు చిత్తశుద్ధితో ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా సమన్వయ అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ దిశ సమావేశం తిరుపతి ఎంపి అధ్యక్షతన తొలి సమావేశం జరిగింది. తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి, కో ఛైర్‌పర్సన్ చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, మెంబర్ సెక్రటరీ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జడ్పి ఛైర్మన్ ఆనం అరుణమ్మ, తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపరెడ్డి మౌర్య, మండల ఎంపిపిలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాల్లో దాదాపు 54 పథకాలు అమలవుతున్నాయన్నారు. గాజులమండ్యం సుగర్ ఫ్యాక్టరీ రీ ఓపెనింగ్ చేయాలని సభ్యులు కోరగా వచ్చే నెల మొదటిఆరంలో అక్కడి రైతులతో చర్చించి కోఆపరేటివ్ అధికారులతో కలిపి కమిటీ ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఎన్టీఆర్ హౌసింగ్ పురోగతి మరింతగా ఉండాలని సూచించారు. టిడ్కో నందు నిధుల లేమితో పనులు పురోగతి లేదని అధికారులు తెలిపారు. జడ్పీ ఛైర్మన్ నెల్లూరు మాట్లాడుతూ వాకాడు, నాయుడుపేట, బీఎన్ కండ్రిగ మండలాల్లో అంగన్వాడీ అద్దె భవనాలలో ఉన్న వాటికి స్వంత భవనాలు నిర్మాణానికి జడ్పీ నిధులు ఇస్తామని తెలిపారు.

ఢాం..ఢాం..

అంటించకనే పేలుతున్న ధరలు
గత ఏడాది కంటే 20 శాతం అధికం
పిల్లలకు కొనక తప్పదంటున్న వైనం

అగ్ని ప్రమాదం జరిగితే అత్యవసర సహాయం కోసం 101, 112, 100, 1070 టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించండి..

చీకటి వెలుగుల రంగేళి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

టపాసుల పండగ అంటే ప్రతి ఒక్కరికీ ఇష్టమే. ఇంటిళ్లపాది తారాజువ్వలు కాల్చుతూ వేడుక చేసుకుంటారు. కానీ ఈ ఏడాది టపాసులు కాల్చకనే మండుతున్నాయి. టపాకాయల ధరలు విపరీతంగా పెరిగాయి. గత ఏడాదితో పోల్చుకుంటూ 20శాతం అధికంగా ధర పలుకుతుండడంతో సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు టపాకాయలు కొనేందుకు ఇబ్బంది పడుతున్నారు. అయితే కొనకపోతే పిల్లలు అలిగి గొడవ చేస్తారన్న కారణంతో కొనక తప్పడం లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇంట్లో ఇద్దరు ముగ్గురు పిల్లలుంటే దాదాపు ఐదారువేలు టపాసులకే వెచ్చించే పరిస్థితి ఉంది.

రెండు రోజుల పాటు జరుపుకునే దీపావళి పండుగ మొదటి రోజు నరకచతుర్ధశికి పిల్లలు పెద్దలు అంతా కలిసి టపాకాయలు కాల్చడం సాంప్రదాయం. రాకెట్లు, కాకరొత్తులు, చిచ్చుబుడ్డిలు, భూచక్రాలు, షాట్లు, మిరపకాయ టపాసులు, లక్ష్మీ అవుట్లు, ఆటో బాంబులు, రీల్ టపాసులు, కేబిళ్లలు, చిలకటపాసులు, పాముటపాసులు ఇలా వివిధ రకాల పేర్లతో రకరకాల వెలుగులు ఇస్తూ చిన్న సౌండ్ నుంచి పెద్ద శబ్దాలు చేసే టపాసులను యువత పెద్ద ఎత్తున కాల్చుతుంది. దీపావళి వస్తుందంటే పోటాపోటీగా టపాకాయలు కాల్చేందుకు నెల రోజుల ముందునుంచే ప్రణాళికలు వేసుకుంటారు. తిరుపతికి సరిహద్దు ప్రాంతమైన తమిళనాడు రాష్ట్రం నుంచి టపాకాయలు దిగుమతి చేసుకుంటారు. పల్లిపట్టు వద్ద ఎక్కువగా విక్రయాలు జరుగుతుంటాయి. కొంత మంది టపాకాయలు తయారీకి ప్రఖ్యాతగాంచిన శివకాశీ నుంచి టపాసులను కొనుగోలు చేసి లారీల ద్వారా జిల్లాలోని పలు ప్రాంతాలకు వ్యాపారులు తీసుకొచ్చి హోల్‌సేల్‌గా విక్రయిస్తుంటారు. తిరుపతి కేంద్రంగా 12 గోడౌన్లు ఉన్నాయి. నగరంలో మూడు ప్రాంతాల్లో టపాకాయలు షాపుల నిర్వహణకు అదికారులు అనుమతి ఇచ్చారు. డిబిఆర్ రోడ్డులో, అన్నమయ్య సర్కిల్ సమీపంలోని రైతుబజారు, తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఉన్న నెహ్రూమున్సిపల్ హైస్కూల్ మైదానంలో టపాకాయల విక్రయాలు జరుగుతున్నాయి. రాజకీయ నాయకులు సైతం భారీస్థాయిలో టపాకాయలు కొనుగోలు చేసి కార్యకర్తలకు, నియోజకవర్గ ఓటర్లకు పంచిపెడుతుంటారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది టపాకాయలు ధరలు ఆకాశాన్నీ అంటుతున్నాయి. 20 శాతం మేరకు ధరలు పెరిగాయి.

టపాసులు	గతం(రూ)	ప్రస్తుతం (రూ)
మిరపకాయ టపాసు (చిన్నది)	30	50
మిరపకాయ టపాసు (పెద్దది)	80	120
లక్ష్మీ ఔట్ (చిన్నది)	40	65
లక్ష్మీ ఔట్ (పెద్దది)	120	150
టపాకాయల బాక్స్ (16ఐటమ్స్)	350	500
(22 ఐటమ్స్)	600	800
(35 ఐటమ్స్)	900	1200
(60 ఐటమ్స్)	1500	2,100

ఇల్లు గడిచేదే కష్టం : టి.గిరిబాబు, పండ్ల వ్యాపారి, శ్రీనివాసపురం

పది సంవత్సరాలుగా అరిటిపండ్ల వ్యాపారం చేసుకుని కొడుకు, కూతురు, తల్లి, భార్యను పోషించుకుంటున్నాను. వ్యాపారం కోసం వడ్డీలకు అప్పు చేశాను. ప్రతి నెల వడ్డీ కట్టేందుకే కష్టంగా ఉంది. ఇంక ఇల్లు గడిచేది మరీ కష్టం. ఇలాంటి తరుణంలో పండగలంటే ఇబ్బంది తప్పదు. ఎదుటవారి ముందు తక్కువ కాకూడదని, వడ్డీలకు అప్పులు తెచ్చి, పండుగలు జరుపుకుంటున్నాం.

తల్లిదండ్రుల సమక్షంలోనే కాల్చాలి : ఎల్.సుబ్బరాయుడు, ఎస్పి

పిల్లలు టపాసులను తల్లిదండ్రుల సమక్షంలోనే కాల్చేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అపుడే ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నిజమైన పండుగను ఆనందంగా జరుపుకోగలుగుతాం. దీపావళి వెలుగులు అందరి మార్గాన్ని ప్రకాశవంతం చేసి ఉజ్వల భవిష్యత్ వైపు నడిపించాలి.

అప్పుల తిప్పలు తప్పదు : ఎన్.ప్రనూష, కాంట్రాక్టు కార్మికురాలు, వేదాంతపురం అగ్రహారం

మాకు ఇద్దరు చిన్నపిల్లలు. కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేస్తున్నా. వచ్చే అరకొర జీతం డ్వాక్రా, చీటీ, ఇఎంఐలకు సరిపోతుంది. ఇలాంటి పండగలు వస్తే కొత్త బట్టలు కొనాల్సిందే. టపాసులు తప్పనిసరిగా కొనివ్వాలి. లేదంటే పిల్లలు ఒప్పుకోరు. వాళ్లకేం తెలుసు ధరల పరిస్థితి. అందుకే అప్పు చేసైనా దీపావళిని వేడుకగా జరపాల్సిందే.

ముచ్చటైన ప్రమిదలు

ప్రజాశక్తి - డక్కిలి

వెంకటగిరి పట్టణంలో దీపావళి సందడి మొదలయ్యింది. గురువారం పండుగ కావడంతో పట్టణంలోని తు త్రిభువనీ సెంటర్, కాశీపేట, బజార్ సెంటర్ వంటి ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేకంగా ప్రమిదల దుకాణాలు వెలిశాయి. దీంతో వెంకటగిరి సమీప గ్రామాల ప్రజలు పండుగ సామగ్రి కొనుగోళ్ల కోసం వెంకటగిరి రావడంతో బజార్ సెంటర్ కొనుగోలు దారులతో కిక్కిరిసింది. ప్రజలను ఆకట్టుకునేలా మార్కెట్లో విభిన్న రకాల ప్రమిదలు అందబాటులో లభిస్తున్నాయి. దేవతామూర్తుల రూపంలో ప్రమిదలు తయారు చేసి మార్కెట్లో ఉంచారు. దుకాణాల్లో రంగు రంగుల విద్యుత్ దీపాలు అందుబాటులో ఉన్నాయి. ఇక పట్టణంలో విశ్వోదయ జూనియర్ కళాశాల క్రీడాప్రాంగణం ఆవరణలో టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేశారు.

మట్టి ప్రమిదలు లేకుండా దీపావళి పండుగను ఊహించలేం. ఇవి దీపావళికి ప్రత్యేక అతిథులు. దీపావళి పండుగరోజు ప్రతి ఇంటకాంతులు వెదజల్లేది మట్టి ప్రమిదలే. దీపావళి పండుగ నుంచి కార్తీక పౌర్ణమి పూర్తయ్యే వరకు ఇంటిని నిత్యనూతనంగా చేసేది ప్రమిదలే. కాలానుగుణంగా తమ రూపురేఖలను మార్చుకుంటున్నాయి. ప్రమిదలు ప్రస్తుతం విభిన్న రీతుల్లో ఆకట్టుకుంటున్నాయి. లక్ష్మీదేవి, వినాయక స్వామి తదితర దేవతామూర్తులు ఉన్న ప్రమిదలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అంతే గాక ఏనుగు, కొబ్బరికాయ ఆకారం, కలువపువ్వు తదితర ఆకారాల్లోని ప్రమిదలను పట్టణ వాసులు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. డజను ప్రమిదలు రూ.50 నుంచి రూ. 500 వరకు ఉన్నాయి. దీపావళి రోజు ప్రతి ఇంటి ముందు విభిన్న రూపాల్లో ఉన్న ప్రమిదలతో దీపాలు వెలిగిస్తే ఇంటి ఆవరణమంత కాంతులతో వెలిగిపోతుంది. అదే విధంగా చూడటానికి కూడా అందంగా కనిపిస్తుంది. దీపావళి రోజు మాత్రమే ఎక్కువగా ప్రమిదల్లో దీపాలు వెలిగిస్తాం. ఇంటి ముందు రంగురంగుల పూలతో అలంకరించి పూల మధ్యలో మట్టి ప్రమిదల దీపాలు పెట్టడంతో ఆ ఇల్లు దీపాల కాంతులతో వెలిగిపోతుంది.

జరా....భద్రం...!

పిల్లలు మారం చేస్తున్నారని, యువకులు ఆశపడ్డారని, కుటుంబ సభ్యుల కోరికమేరకు టపాకాయలు కాల్చుతారు. కానీ ఏ మాత్రం ఏమరుపాటుతో ఉన్న ఇంటిళ్లపాదికి ఈ దీపావళి విషాదాన్ని మిగుల్చుతుంది. అప్రమత్తంగా ఉంటూ వృద్దులు, మహిళలు, పసిపిల్లల పట్ల దృష్టిపెట్టి, టపాకాయలు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదమే.

సూచనలు

- టపాసులు కాల్చే ప్రదేశం స్వేచ్ఛగా, బహిరంగంగా ఉండాలి.
- తగిన దూరం పాటించాలి.
- టపాసులకు నిప్పు పెట్టేటప్పుడు పొడవాటి కడ్డీలాంటిది మాత్రమే వాడాలి.
- పక్కనే నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలి.
- టపాసులను వెలగలేదని ఊదడం, నలపడం చేయకూడదు.
- నిప్పురవ్వలు ఎగిసిపడకుండా మిగిలిన టపాకాయలను దూరంగా ఉంచాలి.
- పిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలి.
- చేతుల్లో టపాసులు ఉంచుకుని కాల్చడం, విసిరేయడం చేయకూడదు.
- గడ్డివాములు, పాకలు, పందిళ్లకు దూరంగా టపాసులు కాల్చాలి.
- విద్యుత్ వైర్లు, కరెంట్ స్థంబాల పక్కనే టపాసులు కాల్చకూడదు.

స్వచ్ఛ దివాళి.. శుభ దివాళి

తిరుపతి టౌన్ : నగరంలో పారిశుధ్యం పెంపొందించి, పచ్చదనం పెంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమైందని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం కచ్చపి ఆడిటోరియంలో 'స్వచ్ఛ దివాళి.. శుభ దివాళి' నిర్వహించారు. కమిషనర్ ఎన్.మౌర్యతో కలిసి పారిశుధ్య కార్మికులకు పిపిఈ కిట్లు, బట్టలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వాహనాలకు ఆయుధపూజ నిర్వహించారు. తుడా సెక్రటరీ వెంకట నారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కష్ణారెడ్డి, ఈఈ రవీంద్రయ్య, ఎల్‌పి. సుజన, ఏపిఓ సుగుణ, పిఓ దేవికుమారి, మోహన్ పాల్గొన్నారు.

అరణియార్ ప్రాజెక్టుకు ఆయుధపూజ

ప్రజాశక్తి -పిచ్చాటూరు పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టుకు తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్చార్జి, మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ డి. ఇలంగోవ రెడ్డి, ఇరిగేషన్ డిఈ రామచంద్రమూర్తి బుధవారం ఆయుధపూజ నిర్వహించారు. నాయకులు పద్దు రాజు, ప్రాజెక్ట్ ఏ ఈ లోకేష్, విద్యుత్ శాఖ అధికారి రవి పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద ఏదీ..?

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్



పల్లె ప్రగతి కోసం గత టిడిపి హయాంలోనే (2014-19 మధ్యకాలంలో) రాష్ట్ర ప్రభుత్వం 'చెత్తనుంచి సంపద' అంటూ ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. మండల కేంద్రాల్లో సాలిడ్ వేస్ట్ యూనిట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వీటికి అయ్యే ఖర్చు ఉపాధి హామీ నిధులతో ముడిపెట్టింది. లక్షల్లో ప్రజాధనాన్ని ఖర్చు చేశారు. వీటి బాగోగులకు ప్రతి వెయ్యి మందికి ఒక హరిత రాయబారిని నియమించారు. ప్రతి ఇంటికీ రెండు చెత్త బుట్టలను అందించారు. అయితే చెత్తను సంపదగా మార్చే ప్రక్రియ మాత్రం 'చెత్త'బుట్టలోకే వెళ్లింది.

నిబంధనల ప్రకారం షెడ్డు నిర్మాణం చేపట్టి అందులో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి, ఎరువుగా మార్చి చెత్త నుంచి సంపద ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. దీనిద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగించాల్సి ఉంది. మండలంలో మొత్తం 46 పంచాయతీలు ఉండగా 39 చెత్త సంపద కేంద్రాలను నిర్మించారు. రెండువేల జనాభా కన్నా ఎక్కువ ఉన్న పంచాయతీలకు ఆరు లక్షలు, తక్కువ జనాభా ఉంటే నాలుగు లక్షలు ఖర్చు చేశారు. అయితే 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గడిచిన ఐదేళ్లలో చెత్త సంపద కేంద్రాలకు రంగులు వేయడం తప్ప వాటిని వినియోగం లోకి తీసుకురాలేదు. వైసిపి హయాంలో నిధులు కేటాయించకపోవడంతో ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సిన పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగానే వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. ఇకనైనా తిరిగి టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెత్త సంపద కేంద్రాలను వినియోగం తీసుకురావాలని, రైతులకు తక్కువ ధరకు సేంద్రీయ ఎరువులను అందించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే వినియోగంలోకి తెస్తాం : పద్మజ, ఈవోపిఆర్‌డి

కొన్ని చెత్త సంపద కేంద్రాలు వినియోగంలో లేని మాట వాస్తవమే. ఈ మధ్యకాలంలో నిరుపయోగంగా ఉన్న కేంద్రాలను పరిశీలించాం. త్వరలోనే వాటిని వినియోగంలోకి తెచ్చి సేంద్రీయ ఎరువులను తయారు చేసి రైతులకు అందుబాటులోకి తెస్తాం.

వేధించేందుకు విఆర్‌ఒలే దొరికారా?

ఎన్నికల వ్యయ నిధులు అందక ఇక్కట్లు
నిధులు విడుదలైనా చెల్లించని అధికారులు

ప్రజాశక్తి - రామచంద్రాపురం

విఆర్ఒలు రెవెన్యూలో అతి చిన్న సామాన్య ఉద్యోగులు.. అయితే వీరికి గ్రామాల్లో మంచి గుర్తింపు ఉంటుంది.. ఈ గుర్తింపే వారి కొంప ముంచింది.. సాధారణ ఎన్నికలు 2024 సందర్భంగా తిరుపతి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల ఖర్చులు, పోలింగ్ ఏర్పాట్లకు సంబంధించి షామియానా, క్యూలైన్ బారికేడ్లు, తాగునీరు, సిబ్బందికి భోజన వసతులు, విద్యుత్, వాహనాల ఏర్పాటు తదితర మౌలిక వసతుల ఏర్పాట్ల బాధ్యతను విఆర్ఒలకు అప్పగించారు. దీంతో ఆయా షాపుల నుంచి అప్పులు చేసి సౌకర్యాలను బ్రహ్మాండంగా కల్పించారు. అయితే ఎన్నికల వ్యయ నిధులు రెండు విడతలు విడుదలైనా విఆర్ఒలకు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు చేతివాటం చూపిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారన్న విమర్శలున్నాయి. కొంతమంది విఆర్ఒలైతే అప్పు తెచ్చిన చోట మాటలు పడలేక అప్పులు చేసి తీర్చారని సమాచారం. ప్రస్తుతం వారికి ఆ అప్పులే గుదిబండలుగా మారాయి. సాధారణ బదిలీల్లో భాగంగా విఆర్ఒలు బదిలీ అయినా, అప్పులు చెల్లించక తలలు పట్టుకుంటున్నారు. ఒక్కో విఆర్ఒపై 40వేల పైనే భారం ఉన్నట్లు సమాచారం.

ముఖ్యంగా విఆర్ఒలపై నమ్మకంతో టిఫిన్లు, కాఫీ టీలు, భోజనాలను హోటళ్ల యజమానులు ఇచ్చారు. అయితే ఎన్నికలు జరిగి ఐదు నెలలైనా అప్పులు చెల్లించకపోవడంతో తమకు బిల్లులతో సంబంధం లేదని, తమ అప్పు తీర్చాల్సిందేనని విఆర్ఒలను ఎక్కడ బడితే అక్కడ ఇబ్బందులు పెడుతుండడంతో కొంతమంది అప్పు చేసి చెల్లించారని తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణ వ్యయం మొదటి విడత జిల్లా ఎన్నికల అధికారి విడుదల చేశారు. అయితే ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించిన అసిస్టెంట్ ఎలక్ట్రో రిటర్నింగ్ అధికారులు చేతివాటం ప్రదర్శించి, పోలింగ్ రోజు ఖర్చు చేసిన డబ్బును విఆర్ఒలకు ఇవ్వకుండా స్వాహా చేసినట్లు సమాచారం. రెండో విడత నిధులను విడుదల చేసినా అదే పరిస్థితి. ఓచర్లు చేతిలో పెట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయిన విఆర్ఒలు చివరకు మీడియాను ఆశ్రయించారు. సాధారణ ఎన్నికల సమయంలో మండల స్థాయిలో సహాయ ఎన్నికల అధికారులుగా పనిచేసేందుకు ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చారు. అయితే ఆ అధికారులు మొదటి విడత విడుదల చేసిన ఎన్నికల బడ్జెట్ నిధులను తప్పుదారి పట్టించినట్లు విమర్శలు ఉన్నాయి.తొలిసారి బడ్జెట్‌లో బిఎల్ఒలకు ఎన్నికల ఖర్చుల నిమిత్తం 12వేలు ఇవ్వాలని ఎన్నికల అధికారి నిర్ణయిస్తే మండల స్థాయి అధికారులు ఐదువేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. బిఎల్ఒలకూ ఎన్నికల నిర్వహణ పారితోషకం అందలేదని తెలుస్తోంది. విఆర్ఒల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఎలక్షన్ బడ్జెట్ నిధులు విడుదల చేయాలని ఇటీవల వినతిపత్రం అందించారు. ఇకనైనా ఎన్నికల బడ్జెట్ నిధులను సక్రమంగా విడుదల చేసి ఖర్చుల వివరాల మేరకు విఆర్ఒలకు చెల్లించాలని వారు కోరుతున్నారు.

ఓచర్ల మేరకు నిధులు చెల్లిస్తాం
శివరాం సుబ్బయ్య, తహశీల్దార్, చంద్రగిరి

ఎన్నికల బడ్జెట్ నిధులు రెండో విడత విడుదలయ్యాయి. చర్చించి ఓచర్లను తీసుకుని నిధులను చెల్లిస్తాం.

'ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

విలేకరులతో మాట్లాడుతున్న తహశీల్దార్ చంద్రశేఖర్

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమల్లో భాగంగా దీపావళి నుంచి ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పథకాన్ని ప్రారంభించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ చంద్రశేఖర్ కోరారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పథకం నిబంధనలను వివరించారు.

తాగునీటి మోటార్‌కు మరమ్మతులు

మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని ఎండి పుత్తూరులో తాగునీటి మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో ప్రజలు నీటికి ఇబ్బంది పడడంతో ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్ కందాటి మోహన ప్రియ వెంటనే స్పంది ంచారు. మెకానిక్‌ని పిలిపించి మోటార్కు మరమ్మ తులు చేయించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

'రెండు రోజుల సెలవు ప్రకటించాలి'

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: అత్యంత ప్రాధాన్యమైన పండుగలలో దీపావళి పండుగ ఒకటి. అలాంటి పండగకు పాఠశాలలకు ప్రభుత్వం సెలవు రెండు రోజులు కాకుండా మూడు రోజులు పాటు సెలవు ప్రకటించాలని మండల పాఠశాల ఉపాధ్యాయ బృందం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రావారిపాలెం మండలంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదాశివరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ దీపావళి చాలా ముఖ్యమైన పండుగ అని విద్యార్థులకు ఉపాధ్యాయ బృందానికి ప్రభుత్వం శుక్రవారం కూడా సెలవు ప్రకటించాలని కోరారు. మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, రాజగోపాల్, వెంకటరమణ, జగదీష్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తులు పొడిగింపు

ప్రజాశక్తి-క్యాంపస్: జాతీయ స్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను 9వ తరగతి, 11వ తరగతి ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుకు చివరి గడువు 9 నవంబర్ 2024 వరకు ఉంటుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ యన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. 9వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకొనుటకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, 11వ తరగతి కొరకు దరఖాస్తు చేసుకొనుటకు ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. పై తరగతులకు దరఖాస్తు చేసుకొనుటకు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న బాల, బాలికలు అర్హులని వివరించారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2010 మే 1 నుంచి 2012 జూలై 31 మధ్య జన్మించిన వారై ఉండాలని, ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2008 జూన్ 1 నుంచి 2010 జూలై 31 మధ్యన జన్మించిన వారై ఉండాలని, పరీక్షా తేదీ 8 ఫిబ్రవరి 2025న ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కొరకు 8688888802, 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఐక్యతగా మెలగాలి

- ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ వెంకటసుబ్బమ్మ

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఐక్యత దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ నంద్యాల వెంకట సుబ్బమ్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒకరినొకరుతో ఐక్యతగా ఉన్నప్పుడు ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఇతరులతో చర్చించినప్పుడు సమస్యకు పరిష్కారం మార్గం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

టపాకాయలు పేల్చేటప్పుడు జాగ్రత్త వహించాలి: సీఐ



పజాశక్తి-తిరుపతి డెస్క్: దీపావళి పండుగ సందర్భంగా టపాకాయలు పే ల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏర్పేడు సీఐ జయచంద్ర అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తగిన జాగ్రత్తలతో కాటన్ దుస్తులు ధరించాలని, అతి ధ్వనితో పేలే టపాకాయకు పిల్లలు దూరంగా ఉండాలన్నారు. ఇయర్ ఫోన్స్ ధరించే విధంగా చూసుకోవాలని, పాదాలకు చెప్పులు ధరించాలని, పిల్లలు టపాకాయలు కాల్చేటప్పుడు తల్లిదండ్రుల పర్యవేక్షణలో కాల్చాలన్నారు. హాస్పిటల్స్‌కు దూరంగా కాల్చాలని, టపాకాయలు కాల్చే సమయంలో సమీపంలో బకెట్లో నీటిని ఏర్పాటు చేసుకోవాలని ఎటువంటి విఘాతాలకు పాల్పడకుండా అందరూ సంతోషంగా దీపావళి జరుపుకోవాలని తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని నిరసన చేసి సబ్ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న ఫిజు బకాయిలు 3480కోట్ల రూపాయలు చెల్లించకపోవడం కూటమి ప్రభుత్వం వచ్చి 4నెలలు కావస్తున్న ఫిజు బకాయిలు విడుదల చేయక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని వారు అన్నారు. ఇటీవల గూడూరు పట్టణం నుంచి ఓ ప్రైవేట్ నర్సింగ్ కళాశాల విద్యార్థులను ఫీజు కడితేనే తరగతులకు అనుమతి ఇస్తాం అని తరగతులు బహిష్కరణ చేసిన విషయంపై ఆ విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే అన్నారు. అదే విదంగా టీడీపీ ప్రభుత్వం సమయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసింది. వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేస్తే తిరిగి కూటమి ప్రభుత్వం రాగానే ఈ పథకంను అమలు చేస్తామని నేటి విద్యా శాఖ మంత్రి హామీ ఇచ్చారని 4నెలలు కావస్తున్న ఈ పథకం గురించి చర్చ లేకుండా ఉందన్నారు. తక్షణమే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. సంక్షేమ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని సొంత భవనాలు నిర్మించాలని మెస్ చార్జీలు పెంచి ఇవ్వాలని తెలిపారు. గూడూరు ప్రభుత్వం డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించి విద్యార్థుల చేరే విధంగా చేయాలనీ జీవో నెంబర్ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులు అందరికీ ఫీజు రియాంబర్స్ మెంట్ ఇవ్వాలని పేర్కొన్నారు. యూనివర్సిటీలలో ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలనీ డిమాండ్‌తో అన్ని మండల కార్యాలయల దగ్గర రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తున్నం అని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి, గూడూరు ఎస్ఎఫ్ఐ బాధ్యులు శ్రీనివాసులు, నాయకులు మహేష్, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

'ఏపీ.. పెట్టుబడులకు అనుకూలం'

మంత్రితో కలిసి అమెరికా పర్యటనలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఏపీ పెట్టుబడులకు అనుకూలమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. అమెరికాలో వివిధ కంపెనీల ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఆయనతో కలిసి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం కొలువైన 4నెలల్లోనే పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఆరు నూతన పాలసీలను రూపొందించిందన్నారు. ఐటీ, రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, మాన్యుఫాక్చురింగ్, ఫార్మా తదితర రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లు రక్తదానం

రక్తదానం చేస్తున్న వలంటీర్లు

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతిలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన బ్లడ్ బ్యాంక్ క్యాంప్‌లో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. పోలీసు అధికారులు వారిని అభినందించి, ప్రశంసా పత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ చందులాల్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, బ్లడ్ బ్యాంక్ సూపర్వైజర్ డాక్టర్ ఠాగూర్, యూనిట్ 7 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మేరీ సుజాత, డాక్టర్ జగన్మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ కార్యశాల

కార్యశాలలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని నర్సింగ్ కళాశాల, చంద్రగిరిలోని మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్ (ఎంఆర్‌హెచ్‌ఆర్యు) సంయుక్తంగా రెండు రోజులు నర్సింగ్ విద్యార్థులకు "సీపీఆర్ శిక్షణ" పై కార్యశాలను నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్స్ తాము పని చేస్తున్న గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు సిపిఆర్‌ను నేర్పి, అత్యవసర సమయాలలో వారి ప్రాణాలను కాపాడడానికి తగిన విధంగా సన్నద్ధులను చేసేందుకు బిఎస్సి నర్సింగ్ ఆఖరి సంవత్సరం విద్యార్థినులను వారి భవిష్యత్తు కార్యాచరణకు సన్నద్ధం చేసే విధంగా సమర్థవంతమైన శిక్షణను ఇవ్వడం లక్ష్యంగా ఈ కార్యశాల నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంగా భవాని, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, క్లినికల్ ఎపిడెమియాలజీ డివిజన్ విభాగాధిపతి, సైంటిస్ట్ 'జి' డాక్టర్ జెజె బాబు, శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ వెన్నెల సాహితి, స్విమ్స్ కార్డియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వనజాక్షమ్మ, ప్రొఫెసర్‌లు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సురేష్ కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

అడ్వెంచర్ క్యాంపునకు మహిళా వర్సిటీ ప్రోగ్రాం అధికారి

ప్రజాశక్తి-క్యాంపస్: అటల్ బిహారీ వాజపేయి మౌంటనేరింగ్ అండ్ అలైన్డ్ స్పోర్ట్స్ ఇన్స్టిట్యూట్‌లో నవంబర్ 2 వ తేదీ నుంచి 11వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగే ఎన్ఎస్-ఎస్ అడ్వెంచర్ క్యాంప్‌కి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిని, మహిళా అధ్యయన విభాగ ఇన్‌ఛార్జ్ హెడ్ డాక్టర్ నీరజ, రాష్ట్ర కంటింజెంట్ లీడర్‌గా వ్యవహరించనున్నారు. ఈ క్యాంప్‌కి వాలంటీర్లుగా వర్సిటీ నుంచి కావ్య, ప్రణవి, మధు, యామిని, మహిత, వెంకటేశ్వరమ్మ ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యావతి ఈ బృందానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు వాలంటీర్లలో ధైర్యాన్ని, నాయకత్వ లక్షణాలను నింపుతాయని, విద్యతో పాటుగా ఇలాంటి నైపుణ్యాలను మెరుగుపరిచే కార్యక్రమాలకు విద్యార్థినులను వర్సిటీ ఎప్పుడూ ప్రోత్సాహిస్తూ ఉంటుందని తెలిపారు.

'ఉపాధి కూలీలకు న్యాయం చేయాలి'

ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్తులు

ఎంపీడీవోకి సమస్యను విన్నవిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-కోట: రాజకీయ కక్ష సాధింపులు లేకుండా ఉపాధి కూలీలకు న్యాయం చేయాలని కొత్తపట్నం ఉప సర్పంచ్, మాజీ జెడ్పిటిసి ఉప్పల్ ప్రసాద్ గౌడ్ అన్నారు. బుధవారం కోట మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కొత్తపట్నం పంచాయతీకి చెందిన ఉపాధి హామీ కూలీలు స్థానిక ఎంపీడీవో వేణుని కలిసి ఉపాధి పనులను కల్పించాలని వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఉప్పల ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక కోట ఏపీవో కక్షపూరితంగా కొత్తపట్నం పంచాయతీలో ఉపాధి హామీ పనులు పెట్టకుండా లేనిపోని సాకులు పెడుతూ ఉపాధి కూలీలకు పనులు లేకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారని ఎంపీడీవో వేణు సమక్షంలో మొరపెట్టుకున్నారు. ఏపీవో వలన కొత్తపట్నం పంచాయతీలో మాత్రమే పనులు పెట్టకుండా కక్ష సాధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఎలాంటి కారణాలు లేకుండా తొలగించడం జరిగిందన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు బుధవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాల, కొలువు నిర్వహించారు. యాగశాల వైదిక కార్యక్రమాల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహించి పవిత్రోత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేకశ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఇన్స్పెక్టర్ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

- గూడూరు డీఎస్పీ రమణ కుమార్

యువకులను అభినందిస్తున్న డీఎస్పీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: రక్తదానం సామాజిక బాధ్యత అని గూడూరు డిఎస్పి రమణకుమార్ అన్నారు. బుధవారం ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. యువతీయువకులు రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిఎస్పి రమణ కుమార్ రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో సిఐలు కిషోర్ బాబు, శేఖర్ బాబు, శ్రీనివాస్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం

ప్రజాశక్తి-క్యాంపస్: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా ఏపీ యూత్ వింగ్ స్పోక్స్ పర్సన్‌గా ఎస్వి భార్గవ్ సాయిను నియమిస్తూ జాతీయ అధ్యక్షులు చెన్నూపాటి శ్రీకాంత్, జాతీయ జనరల్ సెక్రటరీ నందం నరసింహారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా భార్గవ్ సాయి మాట్లాడుతూ మానవహక్కుల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. ఇంత గొప్పటి సంస్థలో ప్రజా సమస్యల పరిష్కారంలో నన్ను కూడా భాగస్వామిని చేసినందుకు అధ్యక్షులు శ్రీకాంత్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

శాంతారాం నియామకంపై కోటా హర్షం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

నాయీ బ్రాహ్మణ సామాజికవర్గ నేత వైద్యం శాంతారాం తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులుగా నియమితులైనందుకు ఆ సామాజిక వర్గ టీడీపీ నేత కోటా చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనకు అప్పగించిన బాధ్యతను త్రికరణ శుద్ధితో నిర్వర్తించాలని కోరుకుంటూ చంద్రశేఖర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఎంపికైన విద్యార్థులు వీరే

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం భారతి తెలిపారు. తిరుపతి మంగళంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జిఎఫ్ జిల్లా బేస్‌బాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనిబరచినట్లు వివరించారు. పాఠశాలలో 9వతరగతి చదువుతున్న సుజాత, లోకేశ్వరి ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు గుంటూరులో నవంబర్ 9, 10, 11 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారని పీడీ గోపికృష్ణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

'పౌర హక్కులపై అవగాహన'

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని ఉదయమాణిక్యం గ్రామపంచాయతీ గడ్డంవారిపల్లిలో పౌర హక్కుల దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు వారి యొక్క విధులు బాధ్యతలు గురించి వివరించారు. రెవిన్యూ సమస్యలు ఉపాధి హామీ, కరెంటు సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు ఇచ్చారు. ఈ సమావేశానికి సర్పంచ్‌తో పాటు ఉపాధి హామీ, కరెంటు, అధికారులు రాకపోవడంతో గ్రామ ప్రజలు మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ పల్లెల్లో వీధిలైట్లు శ్మశాన వాటికలపై వచ్చిన అధికారులకు ఫిర్యాదులు ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా: ఎమ్మెల్యే

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి-గూడూరు టౌన్: టీడీపీ సభ్యత్వంతో కార్యకర్త కుటుంబానికి భరోసా అని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పట్టణ, చిల్లకూరు మండలాల టిడిపి నాయకులు బూత్ కన్వీనర్లు క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో ఎమ్మెల్యే పార్టీ సభ్యత్వాలపై సమావేశం నిర్వహించారు. పలు అంశాలను చర్చించారు. నాయకులు కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర రెడ్డి, చెంచురామయ్య, ఇజ్రాయిల్, రహీం, సోమిశెట్టి చెంచురామయ్య మట్టం శ్రావణి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

- ఎక్సైజ్ సీఐ కరీమా బేగం

మద్యం దుకాణదారులతో మాట్లాడుతున్న సీఐ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఎక్సైజ్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు చేపడతామని ఎక్సైజ్ సీఐ కరీమా బేగం పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో గూడూరు మున్సిపాలిటీ, చిల్లకూరు మండలంలోని 18 నూతన మద్యం షాపుల నిర్వహణకు సంభధించి లైసెన్స్ దారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎక్సైజ్ నిబంధలను అనుసరించి షాపుల సమయ పాలన గురించి ధరల గురించి, బెల్ట్ షాపుల గురించి లైసెన్స్ దారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. నిబంధలను అతిక్రమించినచో కఠినమైన చర్యలు తీసుకోబడుతాయని పేర్కొన్నారు.

కుస్తీ పోటీల్లో ఛాంపియన్‌షిప్ కైవసం

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి-క్యాంపస్: విజయవాడలో ఈ నెల 2 నుంచి 5 వరకు జరిగిన ఏపీ 68వ అండర్ 19 అంతర్ జిల్లాల బాలుర, బాలికల కుస్తీ ఛాంపియన్ షిప్ 2024-25 పోటీల్లో శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినిలు విజేతలుగా నిలిచారు. ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ని కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి దేవి వెల్లడించారు. వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ సాయిసమితిని అభినందించారు. విద్యార్థినిల్లో కె రెడ్డి జీవన (గోల్డ్), ఇ సౌమ్య (గోల్డ్), ఆర్ లక్ష్మి లావణ్య (గోల్డ్), కె సింధు (సిల్వర్), డి.నేహశ్రీ (బ్రాంజ్), ఎమ్ నీలవేణి (బ్రాంజ్), ఎమ్ నిత్యశ్రీ గెలుపొందారు.

ప్రజాశక్తి కార్మికుని తల్లికి నివాళి

నివాళులర్పిస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ప్రజాశక్తి మిషన్ సెక్షన్లో పని చేస్తున్న పి బాలసుబ్రమణ్యం మాతృమూర్తి పి నరసమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో ఆసుపత్రులో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి తుదిస్వాస విడిచారు. ప్రజాశక్తి తిరుపతి ఎడిషన్ మేనేజర్ సిఎస్ ప్రసాద్, సిబ్బంది గుణశేఖర్, చంద్రశేఖర్, ప్రభాకర్, సురేష్, లక్ష్మయ్య, ప్రదీప్, హరి, శరత్ కుమార్‌లు నరసమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు.

అభివృద్ధికి తోడ్పడతాం

సమావేశంలో ప్రసంగిస్తున్న చైర్మన్ హరి

- మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో ఎల్లప్పుడూ ముందుంటాం అని ఛైర్మన్ ఆనంగి హరి అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ సమావేశం ఛైర్మన్ హరి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మున్సిపల్ అజెండా చదివి వినిపించారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ చెరువు పూర్వకాలవపైన పూర్తిగా ఆక్రమించుకొని ఇండ్లు కట్టేసినారన్నారు. డ్రైనేజీ కాలువల్లో నీళ్ల పోవడానికి ఇబ్బందికరంగా ఉందని సభలో వివరించారు. వాటిని తొలగించి నీళ్ల పోయే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. నందిమంగళం వెళ్లేందుకు మరాఠీ గేటు వద్ద నుంచి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో వారికి లైసెన్స్ లేక ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిపై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయం వారు కౌన్సిలర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఏదైనా పనులు చేపట్టాలంటే కౌన్సిలర్‌తో చర్చించి చేయాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. సమ్మర్ స్టోరేజ్ మరమ్మతుకు గురై ఉన్నాయని వాటిని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కట్టడి చేయాలని కోరారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో రోజుకు 500మంది పైగా వస్తుండగా డాక్టర్లు, సిబ్బంది కొరత వల్ల ఇబ్బందికరంగా ఉందని వాటిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. పట్టణాల్లో దొంగతనాలు, చోరీలు, గంజాయి జరుగుతున్నాయని, పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కుక్కలు బెడద ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నియంత్రణ చర్యలు చేపట్టాలని సభలో సభ్యులు కోరారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్‌లు జయ ప్రకాష్, శంకర్, మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్, మున్సిపల్ మేనేజర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం: విజయశ్రీ

కెనాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెలవల

ప్రజాశక్తి-పెళ్లకూరు: మండలంలోని పునబాక గ్రామం వద్ద బుధవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలుగు గంగ ఏడో కెనాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుచూ ప్రస్తుతం వర్షాలు తక్కువ అవడం వలన చెరువులు నిండక రైతులకు వ్యవసాయ పంటలకు కావలసిన మీరు లేక నిరాశతో ఉన్న రైతులకు ఈ తెలుగు గంగ కాలువ ద్వారా వచ్చే నీటి వలన ఎంతో ఊరటను కలిగించడం జరిగిందన్నారు. ఈ కెనాల్ ద్వారా రోజుకు 200 క్యూసెక్కుల నీళ్లను నెలరోజుల పాటు పారుదల ఉన్నన్ని చెరువులకు నీటిని నింపుకోవాల్సిందిగా ఆమె సూచించారు. తద్వారా ఆ ప్రాంతంలో ఒక్క లక్ష 90ఎకరాల భూమికి నీటి సరఫరా అవుతుందన్నారు. దీంతో ఆ ప్రాంతం సస్యశ్యామలంగా అవుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసీ డైరెక్టర్ విజయభాస్కర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మురాలికృష్ణారెడ్డి, నాయకులు రమేష్ నాయుడు, శ్రీనివాసులు, నాగేందర్ రెడ్డి, కృష్ణయ్య, హరి నాయుడు, నరేంద్ర, యుగంధర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరి సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-పెళ్లకూరు: మండలంలోని కలవకూరు, అనకవోలు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం ఏవో ప్రవీణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుచూ ఒక ఎకరా పొలానికి నారుమడికి 5 సెంట్లు సాగు చేయవలసి వస్తుందని అందుకు రెండున్నర కేజీ నేత్రజని ఒక కేజీ భాస్వరం ఒక కేజీ పొటాష్ దుక్కిలో వేసుకోవాలని సూచించారు. నారును నాటుటకు తీసే ఏడు రోజుల ముందు కార్బొట్యూరన్ గుళికలను వేసుకోవాలని తెలిపారు. జింక్ లోపం ఉంటే లీటర్ నీటిలో రెండు గ్రాముల జేఎస్ఎస్ఓ ఫోర్ ద్రవాన్ని పిచికారి చేయాలన్నారు. మట్టి నమూనా పరీక్ష, విత్తన శుద్ధి, ఏలిది పైర్లులో కలుపులు నివారణ, ఎరువుల వాడకంపై పలు సూచనలు సలహాలు రైతులకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేష్, వీఏఏ రాజేష్, శాస్త్రవేత్త ఠాగూర్, రైతులు పాల్గొన్నారు.